## క్లుప్తంగా

### రెండు జనరేటర్లు ఏర్పాటు



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట హెడ్‌వాటర్ వర్క్స్‌లో కాలిపోయిన 160 కేవీ జనరేటర్ స్థానంలో మున్సిపల్ అధికారులు అద్దె ప్రాతిపదికన రెండు జనరేటర్లను ఏర్పాటు చేశారు. 60హెచ్‌పీ మోటర్‌కు ఒకటి, 40 హెచ్‌పీ మోటర్‌కు ఒకటి ఉపయోగించేందుకు సిద్ధంగా ఉంచారు. 125 కేవీ సామర్థ్యం కలిగిన ఈ రెండు జనరేటర్లకు కలిపి రోజుకు రూ.10వేలు అద్దె చెల్లించనున్నారు. అదేవిధంగా నీటిని క్లోరినేషన్ చేసేందుకు క్లోరిన్ గ్యాస్ ట్యాంకును బిగించారు.

### 30 మందిపై కేసులు నమోదు



నందిగామటౌన్: నూతన మద్యం పాలసీ అమలులోకి వచ్చిన తర్వాత నందిగామ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న 30మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ బంగార్రాజు తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏడుగురు నిందితులను బైండోవర్ చేసినట్లు వివరించారు. అక్రమంగా మద్యం విక్రయించేవారిని ఉపేక్షించేది లేదని, వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నందిగామ, చందర్లపాడు, పెనుగంచిప్రోలు మండలాల్లో ఎవరైనా బెల్టు షాపులు నిర్వహించినా, అక్రమ పద్ధతిలో మద్యాన్ని విక్రయించి ఆసమాచారాన్ని తమకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

### సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి




వత్సవాయి: సైబర్ నేరాల బారినపడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పి. ఉమామహేశ్వరరావు సూచించారు. మండల కేంద్రం వత్సవాయిలో బుధవారం ఆయన సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆన్‌లైన్ మోసాల గురించి ప్రజలకు వివరించారు. ముఖ్యంగా వ్యక్తిగత బ్యాంకు అకౌంట్ నంబర్, ఓటీపీ వివరాలను ఇతరులకు తెలియజేయకూడదన్నారు. కొత్తవ్యక్తులకు, వ్యక్తిగత సమాచారం ఇవ్వవద్దన్నారు. సర్వే పేరుతో ఇళ్లవద్దకు వచ్చేవారు ప్రభుత్వ ఉద్యోగులా? నకిలీ వ్యక్తులా? అనేది నిర్ధారించుకోవాలని సూచించారు.

### నేడు పేట జెడ్పీ స్కూల్‌లో ఆధార్ సెంటర్ ఏర్పాటు

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పట్టణంలోని జెడ్పీ బాలుర హైస్కూల్‌లో గురువారం ఆధార్ ఎన్‌రోల్ సెంటర్‌ను నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు తెలిపారు. కొత్తగా ఆధార్ నమోదు, కార్డులో చేర్పులు, మార్పుల కోసం సంబంధిత ధ్రువీకరణపత్రాలను తీసుకువెళ్లాలని ఆయన సూచించారు.

### ఆకట్టుకున్న కూచిపూడి నృత్యప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో హైదరాబాద్‌కు చెందిన శ్రీసాయి సన్నిధి కూచిపూడి డ్యాన్స్ అకాడమీకి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. బుధవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై రాధిక శ్రీనివాస్ పర్యవేక్షణలో తనమయిశ్రీ, ప్రణతి, కృతి, తన్వి, ఉషా, అవంతిక, రితూ శ్రిగ్ద, అదితి, వేద మహి, యశశ్రీలతో పాటు మరి కొంత మంది చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకుని ఆలయం వెలుపలకు విచ్చేసిన భక్తులు నృత్య ప్రదర్శనను వీక్షించి చిన్నారులను అభినందించారు. అనంతరం ఆలయ ఈవో కె.ఎస్.రామరావు, డెప్యూటీ ఈవో రత్నరాజులు చిన్నారులకు అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు.

### జాతీయ ఫెన్సింగ్ పోటీలకు విద్యార్థి ఎంపిక

మైలవరం: జాతీయ ఫెన్సింగ్ పోటీలకు మైలవరం లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపికయ్యారని కళాశాల పీడీ మేజర్ మన్నే స్వామి తెలిపారు. కళాశాలలో బుధవారం ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో ద్వితీయ సంవత్సరం బీఏ చదువుతున్న సీతయ్య కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల ఫెన్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించాడన్నారు. త్వరలో జమ్మూ కశ్మీర్‌లో జరుగనున్న జాతీయ ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు. విద్యార్థి సీతయ్యను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

# విద్యార్థులకు చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న జగ్గయ్యపేట అడిషనల్ జూనియర్ జడ్జి శోభారాణి



నందిగామలో మాట్లాడుతున్న న్యాయమూర్తి లక్ష్మీరాజ్యం

మక్కపేట(వత్సవాయి): విద్యార్థి దశనుంచే ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జగ్గయ్యపేట అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శోభారాణి సూచించారు. అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీసాయి సెంచరీ హైస్కూల్‌లో బుధవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి శోభారాణి మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠ్యాంశాలతో పాటు చట్టాలు, వాటి పనితీరును విద్యార్థులకు వివరించాలన్నారు. తద్వారా చట్టాలపై వారికి అవగాహన పెరుగుతుందన్నారు. భవిష్యత్‌లో సమాజంలో నేరాలసంఖ్య కూడా తగ్గుతుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. పాఠశాలస్థాయి నుంచే ఎదుటి వ్యక్తులను గౌరవించడం, దురలవాట్లకు దూరంగాఉండడం అలవరచు కోవాలని సూచించారు. సమావేశానికి బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నెపాక సుందరరావు అధ్యక్షత వహించగా, తిరుమలగిరి ఆలయచైర్మన్ కొమరగిరి రవీంద్రభరద్వాజ్, ప్రిన్సిపాల్ కె.సవిత, ఏజీపీ టీఎల్ నరసింహరావు, న్యాయవాదులు మార్కపూడి నాగేశ్వరరావు, మన్నెం మురళి, వల్లపు రవి కుమార్, గురువులు రాజు పాల్గొన్నారు.

**నందిగామ పట్టణంలో..**

నందిగామటౌన్: జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా పట్టణ సమీపంలోని మధిర రోడ్డులో ఉన్న శ్రీవిద్యా పాఠశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి లక్ష్మీరాజ్యం మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, అక్రమ రవాణాకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర శిశు సంరక్షణ కమిషన్ పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. కార్యక్రమంలో నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద్రు బాబు విద్యాసాగర్, న్యాయవాదులు హనుమంతరావు, రమేష్, ఆజాద్, మౌలేశ్వరరావు, శ్రీనివాసరావు, తారాసింగ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



పేటలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పేట కమిషనర్ ఎం.రామ్మోహనరావు



నందిగామలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న రాటకొండ రామకోటేశ్వరరావు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక జిల్లా గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు, ఎంపీడీవో వి.నితిన్ హాజరై ఆయా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పదోవార్డు కౌన్సిలర్ కె.రామలక్ష్మి, జీఆర్‌సీ కళాశాల అధ్యాపకులు దుర్గాప్రసాద్, ఉపాధ్యాయుడు వినోద్, గ్రంథాలయాధికారి ఆలేటి ప్రభ, సిబ్బంది జె.శ్యామల, మల్లిక, రమేష్, సత్యవతి, రాము, విద్యార్థులు పాల్గొన్నారు.

**పుస్తక పఠనంతో ఎన్నో ప్రయోజనాలు..**

నందిగామటౌన్: పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని సముపార్జించుకోవచ్చని కూటమి నాయకుడు రాటకొండ రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.పుస్తకాలకు మించిన స్నేహితులు మరొకరు ఉండరని పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, క్విజ్, వక్తృత్వం, ఆటల పోటీల విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మస్తాన్‌వలి, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం విజయలక్ష్మి, నాయకులు తొర్లికొండ సీతారామయ్య, వడ్డెల్లి సాంబశివరావు, పూజారి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



కొణకంచిలో బహుమతులు అందజేస్తున్న డాక్టర్ వాణి, రమణ, అల్లూరి రామచంద్రుడు

**పెనుగంచిప్రోలు మండలంలో..**

పెనుగంచిప్రోలు(వత్సవాయి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. వారం రోజులపాటు గ్రంథాలయంలో జరిగిన పలు పోటీలలో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈసందర్భంగా జెడ్పీటీసీ వూట్ల నాగమణి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠనం అలవరచుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు కూడా గ్రంథాలయాలు వాటి విశిష్టతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు గ్రామపెద్దలను ఘనంగా సత్కరించారు. గ్రంథాలయ స్థలదాత యేరువ వెంకటేశ్వరరావు, ఐ.మధుబాబు పాల్గొన్నారు.

**కొణకంచిలో..**

మండలంలోని కొణకంచి గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా పోటీల విజేతలకు బహుమతులను అందజేసి అభినందనించారు. కార్యక్రమానికి గ్రంథాలయాధికారి అల్లూరి రామచంద్రుడు అధ్యక్షత వహించగా, జెడ్పీ స్కూల్ హెచ్ఎం ఎం.రమణ, ఆయుర్వేద వైద్యురాలు వాణి, గ్రామపెద్దలు చిన్న మార్కెండేశ్వరరావు, కుక్కర్ రామారావు, తెలుగు ఉపాధ్యాయుడు కె.శివనాగసందీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

# వైభవంగా అయ్యప్ప పడిపూజ

మక్కపేట(వత్సవాయి): మండలంలోని మక్కపేటలో వేంచేసియున్న శ్రీద్వాదశ జ్యోతిర్లింగ అయ్యప్ప ఆలయంలో బుధవారం రాత్రి అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. తమ్మిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అయ్యప్పలు గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని పడిపూజను ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రం కోదాడకు చెందిన వల్లూరమ్మ తల్లి భజన బృందం వారు భక్తిగీతాలను ఆలపించగా అర్చకులు అత్తలూరి యుగంధర్‌శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు సాగాయి. కార్యక్రమంలో ఆలయ ధర్తకర్త మల్లెల గాంధీ, గురుస్వాములు కన్నెగంటి సత్యనారాయణ, కొమరగిరి శ్రీను, లింగాల శేఖర్, కందిమళ్ల రమేష్ పాల్గొన్నారు.



పడిపూజలో పాల్గొన్న అయ్యప్పదీక్షాపరులు

### నేడు విద్యుత్ అదాలత్

మైలవరం: విద్యుత్ అదాలత్‌ను గురువారం మైలవరం రాజా ఎస్వీఆర్‌జీ నరసింహారావు కల్యాణ మండపంలో గురువారం నిర్వహిస్తున్నట్లు విజయవాడ రూరల్ డివిజన్ ఈఈ వసంతరావు తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సదస్సు జరుగుతుందన్నారు. డివిజన్ పరిధిలోని కంచికచర్ల, నందిగామ, జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు, చందర్లపాడు, వీరులపాడు మండలాల విద్యుత్ వినియోగదారులు హాజరై సమస్యలు, ఫిర్యాదులను రాతపూర్వకంగా తెలియజేయవచ్చన్నారు.

# బోరు ఏర్పాటు పనులు ప్రారంభం



నందిగామలోని 16వవార్డులో పర్యటిస్తున్న కమిషనర్ రమణబాబు

నందిగామటౌన్: పట్టణ సమీపంలోని మున్నేరు వాగులో రూ.40లక్షలతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న బోరు పనులను నందిగామ మున్సిపల్ కమిషనర్ రమణబాబు బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరదలకు బోర్లు కొట్టుకుపోవడంతో తాగునీటి సరఫరాలో ఏర్పడిన ఇబ్బందులను తొలగించేందుకు నూతనంగా బోరు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 15రోజుల్లో పనులను పూర్తిచేసి, ప్రజలకు పూర్తిస్థాయిలో నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. ఏఈ ఫణి శ్రీనివాస్ పాల్గొన్నారు.

**పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు..**

నందిగామ పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ రమణబాబు తెలిపారు. ఆయన బుధవారం పట్టణంలోని 16వవార్డులో పర్యటించి, ప్రజల సమస్యలను అడిగితెలుసుకున్నారు. మూడేళ్లుగా తమ నివాసంలో వచ్చిన తడి,పొడి చెత్తను వేరుచేసి సేంద్రియ ఎరువులు తయారు చేసి ఆఎరువుతో ఆవరణలో మొక్కలు పెంచుతున్న ఎం.సునీతాదేవి, బచ్చలకూర శ్యాంప్రసాద్ దంపతులను కమిషనర్ అభినందించారు. కార్యక్రమంలో ఏఈ ఫణి శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఇంద్రకీలాద్రిపై విశేష పూజలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వార్లకు బుధవారం విశేష పూజలు జరిగాయి. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ప్రధాన ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు, విశేష అర్చనలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఆలయ అర్చకులు సహస్ర లింగార్చన నిర్వహించగా, పలువురు ఉభయ దాతలు, భక్తులు సేవలో పాల్గొన్నారు. సహస్ర లింగార్చన అనంతరం స్వామి వారికి చామంతి, గులాబీలతో విశేషంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ సేవ జరిగింది. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామివార్ల ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం ఊంజల్ సేవ జరిగింది. పలువురు భక్తులు, ఉభయ దాతలు, ఆలయ సిబ్బంది కుటుంబ సమేతంగా దీపాలంకరణ సేవలో పాల్గొన్నారు.

# న్యాయవాదులు విధుల బహిష్కరణ



జగ్గయ్యపేటలో నిరసన వ్యక్తంచేస్తున్న న్యాయవాదులు

జగ్గయ్యపేట అర్బన్: బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాది గౌతమ్‌రెడ్డిపై పోలీసుల అక్రమ చర్యలను ఖండిస్తూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు బుధవారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన చేపట్టారు. పోలీసుల దుశ్చర్యను తీవ్రంగా ఖండించారు. నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు బత్తుల వెంకట్రామయ్య, కరణం నరసింహారావు, పసుపులేటి సత్యశ్రీనివాసరావు, ఎం.కృష్ణయ్య, ఎం.ఆంజనేయులు, కె.శ్రీనివాసరావు, రావూరి ప్రసాద్, పూల నాగరాజు, దాసరి నాగేశ్వరరావు, కరిసె రత్నబాబు, అశోక్, శ్రీధర్, శేషకుమారి, అమ్ములు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణపై అధికారులతో సమీక్ష



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో బాలకృష్ణ

నందిగామటౌన్: ధాన్యం సేకరణపై రైతులకు అవగాహన కలిగించాల్సిన బాధ్యత రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారులపై ఉందని ఆర్డీవో బాలకృష్ణ పేర్కొన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో కనీస ధరకు ధాన్యం సేకరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నందిగామ డివిజన్ పరిధిలో 54 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులకు కనీస మద్దతు ధర అందించేందుకే ప్రభుత్వం ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యంకు క్వింటాకు రూ. 2,320, కామన్ రకం ధాన్యానికి రూ.2300 కనీస మద్దతు ధర ప్రకటించినట్లు చెప్పారు. దళారులను నమ్మి మోసపోకుండా రైతులు ధాన్యం సేకరణ కేంద్రాల్లో విక్రయించుకుని కనీస ధర పొందాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మిల్లులకు చేరిన 48గంటల్లోగా రైతుల ఖాతాలలో నగదు జమవుతాయని వివరించారు. ధాన్యం విక్రయించేందుకు ఆసక్తి ఉన్న రైతులు సెల్‌నంబరు 7337359375కు వాట్సప్ ద్వారా సమాచారం అందించవచ్చని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్లు, వ్యవసాయాధికారులు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

# లీటరు పాలకు రూ.2 పెంపు



మాట్లాడుతున్న నెలకుదిటి నాగేశ్వరరావు



కంచికచర్లలో పాడిరైతులతో క్లస్టర్ మేనేజర్

నందిగామటౌన్: పాడిరైతులకు కృష్ణామిల్క్ యూనియన్ అన్ని విధాలుగా తోడ్పాటునందిస్తోందని యూనియన్ పాలకవర్గ సభ్యుడు నెలకుదిటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక పాల శీతలీకరణ కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాలకు లీటరుకు రూ. రెండు ధర పెంచినట్లు తెలిపారు. పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ నరేష్, పాల సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

**పాల ఉత్పత్తిదారులతో సమావేశం**

కంచికచర్ల : కృష్ణా మిల్క్ యూనియన్ పాడిరైతుల అభ్యున్నతికి కృత నిశ్చయంతో పనిచేస్తోందని యూనియన్ మైలవరం క్లస్టర్ మేనేజర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. కంచికచర్లలో మండలంలోని ఆయా గ్రామాల పాల ఉత్పత్తిదారులతోపాటు సంఘ నాయకులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవు పాలు టోటల్ సాలిడ్స్‌కు రూ.10పెంచి రూ.285గా నిర్ణయించామన్నారు. పెంచిన ధరలు డిసెంబర్ ఒకటోతేదీ నుంచి అమలులోకి వస్తాయని తెలిపారు. పాడి రైతులకు రెండో విడత బోనస్ కింద రూ.12కోట్లు కేటాయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కంచికచర్ల పాల ఉత్పత్తిదారుల సంఘ అధ్యక్షురాలు కె.కవిత, కొత్తపేట, మోగులూరు, చెవిటికల్లు సంఘ అధ్యక్షులు బి.శ్రీనివాసరావు, తిరుపతిరావు, అప్పారావు, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

# సత్యసాయికి ప్రత్యేక అభిషేకాలు

నందిగామటౌన్: స్థానిక సత్యసాయి ఆలయంలో భగవాన్ సత్యసాయి బాబా జయంతి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. జయంతి వేడుకల్లో భాగంగా బుధవారం ఓంకారం, సుప్రభాతం, మంగళహారతి, వేదపఠనంతోపాటు స్వామి వారి పాదుకలకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సేవాసమితి సభ్యులు మాట్లాడుతూ వేడుకల్లో భాగంగా గురువారం శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ చేతుల మీదుగా 99 మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు వాసుదేవరావు, సరికొండ రవీంద్ర, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# యూటీఎఫ్ గోడపత్రిక ఆవిష్కరణ



పెండ్యాలలో గోడపత్రికను ఆవిష్కరిస్తున్న పులి శ్రీనివాసరావు, రామారావు తదితరులు

కంచికచర్ల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తమ సంఘం నిరంతరం కృషి చేస్తోందని యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పులి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పెండ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం యూటీఎఫ్ మహాసభ గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 24న విజయవాడ ఎంబీ విజ్ఞానకేంద్రంలో నిర్వహించే జిల్లా యూటీఎఫ్ ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా, మండల సంఘ నాయకులు మేరుగ రామారావు, ఫణీంద్రకుమార్, టి.వెంకటేశ్వర్లు, జి.కృష్ణ, అమీర్ పాషా, పల్లె శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



జగ్గయ్యపేట అర్బన్: బైబిల్ ఓపెన్ యూనివర్సిటీ ఇండియా ఇంటర్నేషనల్ డైరెక్టర్ జయశాలి పీడీ సుందరరావు పుట్టినరోజును పురస్కరించుకుని ఏబీటీసీసీ సభ్యులు బుధవారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బైబిల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సుధీర్‌కుమార్, ఏబీటీసీసీ జగ్గయ్యపేట మండల ప్రెసిడెంట్ ఇనపనుర్తి శ్రీనివాసరావు, కార్యదర్శి ఎ.కుమార్, ట్రెజరర్ జి.ఏసుపాదం, అధ్యాపకులు కె.కుమార్, ఎం. సురేష్, చర్చి కమిటీ సభ్యులు రఘు పాల్గొన్నారు.